క్లుప్తంగా

మణికంఠ స్వామికి నక్షత్ర హారతి



అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు నారాయణ నంబూద్రి

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీమణికంఠ స్వామి ఆలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణ నంబూద్రి స్వామివారికి నక్షత్ర హారతి పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామికి ఉదయం మహాగణపతి హోమం, పంచామృత అభిషేకాలు, తులసి పూజలు చేశారు. అయ్యప్ప మాలధారులు కీర్తనలు ఆలపించి నృత్యాలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కాకినాడ వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో సింహాచలానికి పింఛను అందజేస్తున్న వలంటీర్ స్వప్నప్రియ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలుకు చెందిన వృద్ధురాలు సందక సింహాచలానికి రెండు వారాల క్రితం కాలు విరగడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ స్వప్నప్రియ గురువారం సదరు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్ స్వప్నప్రియను పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి అభినందించారు.

అవినీతి నిర్మూలన సమష్టి బాధ్యత

రాజానగరం: అవినీతి నిర్మూలన సమష్టి బాధ్యత అని ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ జనరల్ మేనేజర్ (విజిలెన్స్) డి.రామకృష్ణన్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గైట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తే అద్భుతాలు సాధించవచ్చన్నారు. అవినీతి నిర్మూలనలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నైతికనిష్టను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ హెచ్‌ఆర్ ఆర్.రామారావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పీఆర్‌కే రాజు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

మధురపూడి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా కోరుకొండ మండలం కాపవరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద గురువారం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమారాధనకు కాపవరంతో పాటు కోరుకొండ, జంభూపట్నం గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు కాలచర్ల శ్రీను, కనుబోజ్జి సూర్యచంద్రం, లంకా వీరబాబు, పచ్చారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. బూరుగుపూడి పాతూరు రామకోవెల వద్ద కూడా అన్న సమారాధన జరిగింది. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సారా కేసులో నలుగురి అరెస్టు

రంగంపేట: సారా కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ గురువారం తెల్లవారుజామున మండలంలోని ఈలకొలనులో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో కురుకూరి రామకృష్ణ, కురుకూరి శివ, మల్లెల చిన్నచక్రం, అంచూరి సుబ్బయ్యమ్మలు సారా కలిగి ఉండటంతో వారిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్టు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం: సీతానగరం ఏటిగట్టుపై గురువారం మధ్యాహ్నం ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి చనిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. వంగలపూడికి చెందిన పిటకా వీర వెంకట సత్యనారాయణ(34) గోదావరి ఇసుకను ఎడ్లబండిపై సరఫరా చేస్తుంటాడు. ఇసుక సొమ్ము వసూలు చేసుకుని సీతానగరం నుంచి బైక్‌పై తిరుగు పయనమయ్యాడు. వంగలపూడి మార్గంలోని శింగవరంలో ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా, ఏటిగట్టుపై అతడి బైక్‌ను ఎదురుగా వచ్చిన కూరగాయల ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దవాఖానాకు మహర్దశ

- సీతానగరం పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు రూ.8 కోట్లు మంజూరు
- నాబార్డ్ సాయం రూ.6.53 కోట్లు
- ప్రభుత్వ వాటా రూ.1.57 కోట్లు
- కార్యరూపం దాల్చిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి



సీహెచ్‌సీగా అభివృద్ధి కానున్న సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రాజానగరం: రాష్ట్ర ప్రజానీకానికి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రధానంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం, పక్కా భవనాలు నిర్మించడం ద్వారా కార్పొరేట్ వైద్య సేవలు ప్రభుత్వాస్పత్రుల్లోనే లభించేలా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి (రెండు పనులు), కృష్ణా, గుంటూరు (రెండు పనులు), కర్నూలు జిల్లాలోని 8 ప్రభుత్వాస్పత్రుల్లో నాబార్డు సాయంతో రూ.172.50 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి, నిర్మాణ పనులకు గాను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు అక్టోబరు 31న జీఓఎంఎస్ నం.195ని విడుదల చేశారు. ఇందులో భాగంగానే సీతానగరం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా హోదా కల్పించి, అభివృద్ధి చేస్తున్నారు.

సీతానగరం పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.8 కోట్లు

ఈ ఎనిమిది ప్రభుత్వాస్పత్రుల్లో తూర్పుగోదావరి జిల్లాలోని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఉంది. నియోజకవర్గంలో ఏటిపట్టు ప్రాంతంగా ఉన్న సీతానగరం పీహెచ్‌సీని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేసిన ప్రతిపాదనకు ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం లభించిన సంగతి విదితమే. అలాగే కొత్తగా 23 పోస్టులు కూడా మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూ.8 కోట్ల నిధులు మంజూరు కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిధుల్లో రూ.6.53 కోట్లు నాబార్డ్ ద్వారా కాగా, మిగిలిన రూ.1.57 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉంది.

దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది



రాష్ట్రంలో వైద్యరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యం దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలోనే ప్రజల ఆరోగ్యం కోసం ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింతగా విస్తతపర్చడంతో పాటు 108, 104 వాహనాలను కూడా ఆధునిక సదుపాయాలతో విస్తరించడం, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టారు. ప్రతి జిల్లాలోను మెడికల్ కళాశాల ఉండాలనే సంకల్పంతో రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఏటిపట్టు ప్రాంతంగా ఉన్న సీతానగరంలో 30 పడకల ఆస్పత్రి అవసరాన్ని గుర్తించి, అందుకు అనుమతులు, నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– జక్కంపూడి రాజా, రాజానగరం శాసన సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

గాడాలలో జగనన్న ఆరోగ్య సురక్ష



గాడాలలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్, పార్టీ నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల హైస్కూల్ ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. మొత్తం 705 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, 23 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. మొత్తం 123 మందికి కళ్లజోళ్లు అందజేశారు. పాలచర్ల పీహెచ్‌సీ డాక్టర్ బెనిడిక్, శ్రీవాణి వైద్య సేవలందించారు. కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ శిబిరాన్ని పరిశీలించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు చాటపర్తి దుర్గారావు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండపల్లి దుర్గారావు, కోనా శ్రీను, పైడిమళ్ల ధనరాజ్, సచివాలయ సెక్రటరీ సత్యానంద కుమార్, గాడాల హైస్కూల్ హెచ్‌ఎం నిర్మలా జ్యోతికుమారి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలు గడప గడపకూ విచ్చేసిన ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఇంటింటా మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే తమకు అనేక సంక్షేమ పథకాలు అందాయని తామంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారంటూ ప్రజలు ఏ గడపకు వెళ్లిన ఆనందం, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి వెంకటపద్మావతి, సత్తి లక్ష్మి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, డీసీఎం డైరెక్టర్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, చింతా దొరబాబు, నల్లమిల్లి వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ జట్టు సభ్యులు

రాజానగరం: వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక గురువారం స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో జరిగింది. యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రధాన జట్టుకు 12 మంది, స్టాండ్ బైగా ఐదుగురు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 9 నుంచి 12 వరకూ జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని జీఎస్‌ఎల్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథ్, పీడీ డీవీపీఎస్ శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారుల ఎంపికకు పరిశీలకులుగా టి.గురునాథం, ఎన్‌ఆర్‌ఐ చినకాకాని, ఎస్.నల్లయ్య వ్యవహరించారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



రాజానగరంలో రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

రాజానగరం: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు టైరుకు పంక్చర్ పడటంతో రోడ్డు మధ్యలో ఆగిపోయింది. బస్సు నెమ్మదిగా వెళ్తుండడంతో, అందులో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. రాజానగరం పోలీసు స్టేషన్ ఎదురుగా పాత ఎన్‌హెచ్‌పై గురువారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఏలేశ్వరం నుంచి రాజమహేంద్రవరానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు రాజానగరం బస్టాండ్‌లో ఆగి ఉంది. బస్సు ముందుకు కదిలే సమయంలో ముందు చక్రానికి పంక్చర్ పడింది. పోలీసు స్టేషన్ ఎదురుగా జనం రద్దీ ఉన్నప్పటికీ, బస్సు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో, డ్రైవర్ వాహనాన్ని రోడ్డు మధ్యలోనే సులువుగా అదుపు చేశారు. అందులో ప్రయాణికులను డ్రైవర్, కండక్టర్లు వేరే బస్సులో పంపించి వేశారు. ఈ క్రమంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం



తోకాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, మహిళాలోకానికి ఇది శుభపరిణామమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని తోకాడ, కానవరంల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో మహిళల రక్షణకు, భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారని, దిశ చట్టం, పోలీసు వ్యవస్థపై వివరించారు. సంక్షేమ పథకాలన్నింటిలో మహిళలకే ప్రాధాన్యమిస్తున్నారని గుర్తుచేశారు. ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్ వచ్చే ఏడాది జనవరి నుంచి రూ.3 వేలకు పెంచుతారన్నారు. సంఘాల పరంగా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు ఏపీఎం హేమనాగలక్ష్మి, ఆయా గ్రామాల నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు గురువారం స్థానిక గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి, క్రీడా సమాఖ్య అధ్యక్షులు ఎస్.అబ్రహం, ఉప విద్యాధికారి నారాయణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయిలో ఆడాలని అకాంక్షించారు. స్కూల్ ఫెడరేషన్ కార్యదర్శి కెవీ స్వామి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జెవివి అప్పారెడ్డి, కోశాధికారి కె. సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అసోసియేషన్ కార్యదర్శి వీటీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: నన్నయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ డిగ్రీ కళాశాలల కబ్బడీ పోటీలు గురువారం స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ జోన్-1, 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ సి.కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో మొత్తం 20 జట్లు తలపడుతున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయన్నారు. అకడమిక్ డీన్ పి.సురేష్, కళాశాల క్రీడా విభాగాధిపతి ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపురంలో పీడీఎస్ బియ్యం పట్టివేత



నర్సాపురంలో అధికారులు సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం బస్తాలు

మధురపూడి: రేషన్‌కార్డు దారుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యాపారిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన ఇంటిపై కోరుకొండ మండలం నర్సాపురంలో గురువారం దాడి చేశారు. రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో ఓ ఇంట్లో 10 గోనె సంచుల్లో 500 కేజీల పీడీఎస్ బియ్యాన్ని దాచినట్టు గుర్తించారు. దీని విలువ రూ.20,500గా లెక్కించారు. బియ్యాన్ని సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని దాచిన కొయ్య రవిబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుకొండ పోలీసులకు సిఫార్సు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఎస్సై జగన్నాథరెడ్డి, ఏజీ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ లోవరాజు, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు. నర్సాపురం గ్రామానికి చెందిన కొయ్య రవిబాబు రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కిలో రూ.15కు కొనుగోలు చేస్తుంటాడు. మండలంలోని ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు అధిక ధరకు అమ్ముతుంటాడు, వీరంతా ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు అభ్యసన సామర్థ్య పరీక్ష

బిక్కవోలు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్‌ఏఎస్) పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 సీహెచ్‌వీ సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 937 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారని చెప్పారు. పరీక్ష ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణ స్థాయి, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం అంచనా వేయొచ్చన్నారు.

ఉమా మార్కండేయేశ్వర స్వామి ధర్మ ప్రచార వారోత్సవాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): సనాతన హిందూధర్మ పరిరక్షణ కోసం, సమాజంలో ఆధ్యాత్మిక ఐక్యత కోసం, భక్తుల చెంతకే భగవంతుడి దర్శనభాగ్యం కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నెల 4 నుంచి ఉమా మార్కండేయేశ్వర స్వామి వారి ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టు వద్ద ఉన్న ఉమా మార్కండేయేశ్వర స్వామి వారి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ, ధర్మదాయ శాఖ, ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10 వరకూ ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 4న స్టేడియం రోడ్డులోని మంగళవారపుపేటలో, 5న పాత నామవరం సెంటర్‌లో, 6న అప్సర థియేటర్ వద్దనున్న శ్యామలాంబ దేవాలయం వద్ద, 7న రాజానగరంలోని తూర్పుగానుగోడెం, 8న వీఎల్ పురంలోని దుర్గాదేవి ఆలయం, 9న అన్నపూర్ణపేట రామాలయం వీధిలో, 10న రెల్లిపేటలోని కుంచెమాంబ ఆలయం వద్ద స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఫలం స్వీటు.. ధర హాటు

- సీతాఫలం ఎట్ ది రేట్ రూ.70
- దిగుబడి తగ్గడమే కారణం

రాజానగరం: రుచిలో సిమ్లా యాపిల్‌ని తలదన్నే ఫలం సీతాఫలం. ప్రస్తుతం మార్కెట్‌లో దీనికి పలుకుతున్న ధర కొనుగోలుదారులను హడలెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఒక్కో ఫలం ధర రూ.70 పైమాటే. దీనితో సీజన్‌లో వీటి రుచి చూడాలనే ఆశతో కొనాలనుకునే సామాన్యులకు ఇది అందని ఫలమైంది.

మెట్ట ప్రాంతంగా పిలిచే చాగల్నాడు ఏరియాలో పండే సీతాఫలాలు రుచిలోనే కాదు ఆకారంలో కూడా ఆకట్టుకునే విధంగా నిగనిగలాడుతుంటాయి. అందుకనే వీటికి దేశ రాజధాని ఢిల్లీలో సైతం మంచి పేరుంది. రాజకీయ ప్రముఖులతో పని ఉన్న వ్యక్తులు కొందరు వీటిని కానుకగా అందజేయడం ద్వారా వీటికి ఈ ఖ్యాతి లభించింది. ఇదంతా ఒకప్పటి మాట, నేడు ఈ ఫలాలు దొరకడమే గగనంగా మారింది.

కనుమరుగవుతున్న తోటలు

రియల్ ఎస్టేట్ ప్రభావంతో చాగల్నాడు ప్రాంతంలో ఇతర పండ్లతో పాటు సీతాఫలాల తోటలు కూడా కనుమరుగవుతున్నాయి. ఈ క్రమంలో 15 ఏళ్ల క్రితం వంద ఫలాలు రూ.50 నుంచి రూ.వందకు లభించేవి. తోటలు తగ్గిపోవడంతో ఫలాల దిగుబడి గణనీయంగా క్షీణించింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. చాగల్నాడు సీతాఫలాలు సాధారణంగా దసరా రోజుల్లో మార్కెట్‌కి వస్తుంటాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో కాస్త ఆలస్యమై, ప్రస్తుతం మార్కెట్‌ని అలరిస్తున్నాయి.

తోటల్లోనే కొనుగోళ్లు

చాగల్నాడు సీతాఫలాలకు రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారి పొడవునా మార్కెట్‌గా ఉంటుంది. ప్రస్తుతం వీటి దిగుబడి చాలావరకు తగ్గిపోవడంతో తోటలకే పోయి, అక్కడే నేరుగా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో అడపాదడపా మార్కెట్ వచ్చే ఫలాలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. సీతాఫలాలను వ్యాపారులు డజను, పాతిక చొప్పున విక్రయిస్తున్నారు. కాస్త పెద్ద సైజు ఉన్న ఫలాలు డజను రూ.1,800 రేటు పలుకుతోంది. ఈ లెక్కన వంద ఫలాల ధర రూ.7,200గా ఉంది. విడిగా కొనాలంటే ఒక్కటీ రూ.70 పైబడి చెల్లించాల్సిందే. కాయల సైజు తగ్గితే రేటు తగ్గుతుంది మినహా లేకుండా తగ్గేదేలే.. అన్నట్టుగా చాగల్నాడు సీతాఫలాల మార్కెట్ పరిస్థితి ఉంది. ఇది కూడా వారం పాటు ఉంటుందని, ఆ తర్వాత చాగల్నాడు సీతాఫలాల దిగుబడే ఉండదంటున్నారు ఇక్కడి వ్యాపారులు.



జాతీయ రహదారి వెంబడి ఉన్న సీతాఫలాల దుకాణాలు



చాగల్నాడు సీతాఫలాలు



టీడీపీ నేతల సంబరాలు హాస్యాస్పదం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఏడుకొండలు



గుల్లా ఏడుకొండలు

గోకవరం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అనారోగ్యాన్ని సాకుగా చూపించి మధ్యంతర బెయిల్ పొందారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబు ఇప్పటికీ నిందితుడే అన్నారు. మధ్యంతర బెయిల్ రావడంపై టీడీపీ నేతలు, ఎల్లో మీడియా ఏదో సాధించినట్టు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది వారి మానసిక వైకల్యానికి సూచన అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆధారలు ఉండబట్టే న్యాయస్థానాలు చంద్రబాబుకి బెయిల్ నిరాకరించాయన్నారు. దీంతో చంద్రబాబు కంటిచూపు, పైల్స్ ఇతర అనారోగ్య కారణాలను సాకుగా చూపించి మధ్యంతర బెయిల్ పొందారన్నారు. ఇవన్నీ తెలిసి కూడా టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు స్కిల్ కుంభకోణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు, అసైన్డ్ ల్యాండ్ వంటి పలు కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్నారన్నారు. నెలరోజుల మధ్యంతర బెయిల్ తరువాత శాశ్వతంగా జైలులోనే ఉండాల్సి వస్తుందన్న విషయం చంద్రబాబుకు కూడా తెలుసన్నారు. టీడీపీని జాతీయ పార్టీగా చెప్పుకునే చంద్రబాబు తెలంగాణలో పోటీ చేయకపోవడం, ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేయడం చూస్తుంటే తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీడీపీ సమూలంగా తుడిచిపెట్టుకుపోతుందని జోస్యం చెప్పారు. టీడీపీ ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లో విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.